క్లుప్తంగా

'చిల్లర రాజకీయాలు చేస్తే ఊరుకోం'

కాళేశ్వరం: ఇసుక లారీతో రోడ్డు ప్రమాదంలో జైన మధునయ్య మృతిచెందితే బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి వచ్చి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని మహదేవపూర్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణరెడ్డి మంథని ప్రజలపై మొసలి కన్నీరు పెడుతున్నారని అన్నారు. పూటకో పార్టీ మారే ఆయనకు మంత్రిపైన మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబులపై అనవసరంగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

నేడు అత్యవసర సమావేశం

కాటారం: వర్షాకాలంలో గ్రామ పంచాయతీల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జీపీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, అవగాహన కార్యక్రమాల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



సతీశ్ (ఫైల్)

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్టుపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సతీశ్ (40) అనే వ్యక్తి అతడికి ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ అలాగే ట్రాక్టర్ మెకానిక్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతుడికి రెండు నెలల క్రితమే వివాహం అయింది. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగాలేక కుటుంబ పోషణ భారమై తన కనీస అవసరాలకు డబ్బులు సరిపోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండేవాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఈ నెల 17న రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ములుగు రూరల్: ఆటో ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన జంగాలపల్లి సమీపంలోని ఎస్‌వీ గ్రాండ్ హోటల్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన బాణాల సంజీవరెడ్డి(65) తన అవసరాల నిమిత్తం ద్విచక్రవాహనంపై ములుగు బయలుదేరాడు. ఎస్‌వీ గ్రాండ్ హోటల్ సమీపంలోకి రాగానే వెనుకనుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో సంజీవరెడ్డికి తీవ్ర గాయాలైయ్యాయి. గమనించిన వారు 108కు సమాచారం అందించగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నిలిచిన ప్రారంభోత్సవం

మంగపేట : మండల కేంద్రంలో రూ.1.29 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన ఎఫ్ఎస్‌సీఎస్ భవన ప్రారంభోత్సవం నిలిచి పోయింది. గతంలో నిర్మించిన రైతుసేవా సహకార పరపతి సంఘం కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 20 గదులతో రెండొంతస్తుల భవనాన్ని నిర్మించారు. కాగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించేందుకు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పాలక మండలి ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో వస్తారనే అంచనాతో టెంట్లు, ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిలిచి పోయినట్లు సంఘం పాలకమండలి, అధికారులు తెలిపారు.

విద్యాకుసుమానికి చేయూత

కన్నాయిగూడెం : పేద విద్యార్థినికి ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు చేయూతనిచ్చారు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ఆలం శ్వేత నీట్‌లో సీటు సాధించింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో చదువుల తల్లికి దాతలు సహకరించాలనే సమాచారాన్ని వాట్సాప్‌లో తెలుపగా ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ చదువుకు ఆర్థిక పరిస్థితి అడ్డు కాకూడదనే ఆలోచనతో సభ్యుల సహకారంతో సాయం చేశామన్నారు. పల్ల లచ్చబాబు, గడ్డం నాగేష్, మడప భూమయ్య, పల్ల తిరుపతయ్య పాల్గొన్నారు.

కాలబెడితే నష్టాలే..

- వరికొయ్యలను తగులబెట్టొద్దు
- మిత్రపురుగులు, సూక్ష్మజీవులు చనిపోయే ప్రమాదం
- పొలంలో కలియదున్నితే భూసారం పెంపు



పొలంలో తగులబెట్టిన వరికొయ్యలు

మహాముత్తారం: వర్షాకాలం వ్యవసాయ పనులు ప్రారంభమతున్నాయి. కొంత మంది నారుమడులు దున్నడం ప్రారంభించారు. దీంతో రైతులు వరి కొయ్యలతో పాటు గడ్డిని కాల్చడం వంటివి చేస్తున్నారు. దీనివల్ల మిత్రపురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయి. అలా కాకుండా రైతులు పొలంలోనే కలియ దున్నడంతో భూసారం పెరుగుతుంది. వరికొయ్యలు తగలబెడితే నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించడమే కాకా భూసారం తగ్గిపోతుంది.

కలియదున్నితే ఎన్నో ప్రయోజనాలు

వరికొయ్యలు, గడ్డిని నేలలో కలియదున్నడంతో సేంద్రీయకార్బన్‌శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది. దుక్కిదున్నే సమయంలో సూపర్‌పాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో ముగిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే ఎకరాకు సుమారు టన్నూ ఎరువు తయారవుతుంది. మొక్కలకు రెండు శాతం నత్రజని, యూరియా 4శాతం పాస్వరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మదాతువులు పంటకు మేలు చేకుర్చుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియదున్నితే గడ్డిద్వారా పోషకాలన్ని తిరిగి నేలకు చేరుతాయి.

కొయ్యలను కాల్చొద్దు

మట్టిని కాపాడుకోవాలంటే కొయ్యకాళ్లను కాల్చొద్దు. వరికొయ్యలను కాల్చడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గడంతో దిగుబడి తగ్గుతుంది.

– సతీష్, ఏఓ, మహాముత్తారం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల–కళాశాలలో రూ.కోటి 35 లక్షల నిధులతో నిర్మించిన ఆదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే పలువురి విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలాలను పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యా, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. విద్యార్థులు ఒక లక్ష్యం ఎంచుకుని చదువుకుంటే గొప్ప గొప్ప ఉద్యోగాలు సాధించవచ్చాన్నారు. గత పాలకులు విద్య వ్యవస్థను భ్రష్టు పట్టించారని అవేదన వ్యక్తం చేశారు. అలా కాకుండా ప్రతి పాఠశాలలకు ఒక కమిటి వేసి పాఠశాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే గ్రామాలలో ఉన్న ప్రజాప్రతినిధుల పిల్లలను అదే పాఠశాలలో చేర్పించాలని కోరారు. అలాగే పాఠశాల, హాస్టల్, ప్రతి ఇంటికి సన్నబియ్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. జిల్లాలో మైనింగ్, డీగ్రీ కళాశాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో మండల అధికారులు ప్రజలకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా మండల కేంద్రంలోనే ఉండాలని సూచించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, తహసీల్దార్ ఖాజా మోహియుద్దీన్, ఎంఈఓ రఘుపతి, ఎంపీటీసీలు కట్కూరి పద్మ, దబ్బెట అనిల్, మండల కో ఆప్షన్ సభ్యులు రాజ్‌మహ్మద్, కాంట్రాక్టర్ సదానందం, ఉపాధ్యాయులు శనిగరపు భద్రయ్య, మాజీ జెడ్పీటీసీ సాయిలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, చిలుకల రాయకొంరు, దొడ్డి కిష్టయ్య, కామిడి రత్నాకర్‌రెడ్డి, ఆరెపల్లి మల్లయ్య, బుర్ర లక్ష్మన్, శంకర్, బుర్ర శీనివాస్ పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మాలతి

భూపాలపల్లి రూరల్: డబల్‌బెడ్ రూంల ఇళ్ల పంపిణీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పారదర్శకంగా జరుగుతుందని లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని ఎవరి ప్రలోభాలకు లొంగవద్దని మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు కడారి మాలతి తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కాంగ్రెస్ పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు రేణుక, రజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల, అర్బన్ ప్రధాన కార్యదర్శి జంబోజు పద్మ, బట్టు శ్రీలత, ఎద్దు పుష్ప, నాలిక పరమేశ్వరి, పద్మ, శారద, మంగ, సారక్క తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న టీవీఆర్ సూరి

మంగపేట: మంగపేట నూతన ఎస్సైగా టీవీఆర్ సూరి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ఇటీవల వీఆర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో టీవీఆర్ సూరీని నియమిస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చర్య తీసుకోవాలి

ములుగు రూరల్: పోలీస్ శాఖలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గడ్డి ప్రశాంత్ తన భూమిని ఆక్రమించాడని అతడిపై చర్య తీసుకోవాలని మండలంలోని దేవనగర్ గ్రామానికి చెందిన రైతు ఎస్సీ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు కుమారస్వామి మాట్లాడుతూ.. దేవనగర్ గ్రామంలో 91/3లో తనకు వారసత్వంగా వచ్చిన ఆరు గుంటల భూమిని ఆర్ఎస్సై ఆక్రమించాడని అన్నారు. ఈ నెల 10న కొంత మంది పోలీసులతో వచ్చి బెదింపులకు పాల్పడ్డాడని, 13న హద్దురాళ్లను తొలగించి ఆరు గుంటల భూమిని తనభూమిలో కలుపుకున్నాడని ఆరోపించారు. గ్రామంలో విచారణ జరిపించి న్యాయం చేయాలని అన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్స్‌బుక్స్, పలకలు ఇస్తున్న దాతలు

మల్హర్: మండలంలోని కొయ్యూరులో వెన్నపురెడ్డి రమాదేవి–రాము పెళ్లి రోజు సందర్భంగా వారు కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, పెన్సిల్, పెన్నులు, పలకలు, పండ్లను ఉచితంగా అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయడు రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు బుక్స్, పెన్నులు, పండ్లు ఇవ్వడం చాలా సంతోషమని, పాఠశాల తరుపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైన పెళ్లి రోజు, పుట్టిన రోజు వేడుకల సందర్భంగా దాతలు ముందుకు వచ్చి పాఠశాలకు తమ వంతు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన మర్రిచెట్టు కొమ్మలు



రోడ్డుపై ఉన్న మర్రి చెట్టు కొమ్మలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంక్ సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా మర్రిచెట్టు మండలు పడటంతో కిలో మీటర్ దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం రాత్రి వచ్చిన గాలి దూమారానికి ఏపీజీవీబీ బ్యాంక్ సమీపంలోని మర్రిచెట్టు మండలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో వేప చెట్టు సెంటర్ వరకు వాహనాల రాక పోకలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. కాగా, ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నిందితుడిని ఉరితీయాలి

ములుగు: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాటేపల్లిలో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొట్టకూటి కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వలసవచ్చిన కుటుంబం ఈ ఘటనతో అతాలకుతలం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని ఎన్‌కౌంటర్ లేదా ఉరి తీయకుండా ఎందుకు కాలక్షేపం చేస్తున్నారని వాపోయారు.

భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి



వెంకటాపురం(కె): మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): కొమరంభీం కాలనీ ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ములుగు పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా బెస్తగూడెం గ్రామంలో భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల సాగు భూములకు అధికారులు హక్కు పత్రాలు ఇవ్వటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు పూనెం సాయి, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు కావాలని మంత్రికి వినతి

ఏటూరునాగారం: మండలంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని ఏటూరునాగారం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌పాషా, అలువాల శ్రీనివాస్ మంత్రి సీతక్కను కోరారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చిన మంత్రిని జర్నలిస్టులు కలుసుకొని ప్రెస్ క్లబ్ నిర్మాణ దశలో ఉందని, నిధులు ఇప్పించాలని వేడుకున్నారు. అలాగే ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని కోరారు. త్వరలోనే నిధులు, ఇళ్ల స్థలాలకు భూమిని కేటాయిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సూక ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వెంకన్న, భిక్షపతి, బోడ సత్యం, ప్రతాప్, ప్రవీణ్, కృష్ణ, గంపల శివ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు గ్రామంలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను బలోపేతం చేయటంపై అవగాహన సదస్సును కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రస్తుత పరిస్థితుల్లో గిరిజన సంప్రదాయాలు కనుమరుగుతున్నాయని, గిరిజన సంస్కృతీని ఏ విధంగా కాపాడుకోవాలని అనే ఆశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు హనుమంతు, కామేష్, ఉషారాణి, ఇందిరా, నరేష్ తదితరులు ఉన్నారు.

పరిహారం ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న మహిళా రైతులు

కాళేశ్వరం: చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఎర్రచెరువు కింద భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేసి పరిహారం ఇప్పించాలని మహిళ రైతులు విన్నపించారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అంజేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎర్రచెరువు కింద 473 సర్వే నంబర్‌లో 50 ఎకరాల్లో నిరుపేదలు వ్యవసాయం చేస్తు అరవై ఏళ్లకు పైనుంచి జీవిస్తున్నారన్నారు. ఈ భూములు ముంపులో పోతున్న నేపథ్యంలో సర్వేచేసి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న ఎస్సై

వెంకటాపురం(కె): గోదావరి వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై తిరుపతిరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలైన టేకులబోరు, వెంగళరావుపేట తుర్సవానిగూడెం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి గత వరదల సమయంలో గ్రామస్తులకు ఏర్పాడిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమై గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు వరదలను ఎదుర్కోనేందకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ముంపు ప్రాతాలకు గురయ్యే గ్రామాలకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. వరదల సమయంలో ఎలాంటి సమస్యనైన గ్రూప్‌లో పెట్టాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలకు పోలీసులు గోదావరి వరదల సమయంలో ఉండాగా ఉంటారని తెలిపారు.

వరదలపై అవగాహన ర్యాలీ

గోవిందరావుపేట: మండల పరిధిలోని ప్రాజెక్ట్ నగర్ గ్రామంలో గ్రామస్తులతో కలసి మంగళవారం పస్రా ఎస్సై కమలాకర్ వరదలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పస్రా ఎస్సై తన సిబ్బందితో కలిసి రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకోని వరద ముంపునకు గురయ్యే ప్రాజెక్ట్ నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని అన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ రాణిబాయ్

కాళేశ్వరం: నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ రాణిబాయ్ అన్నారు. అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహదేవపూర్, పలిమెల మండల స్థాయి అధికారులతో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఎంపీపీ సమక్షంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20న ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ నట్టల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు ఈ జాతీయ ఆరోగ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ కృష్ణ, మహదేవపూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పలిమెల ఎంపీడీఓ శ్రీనివాస్, వెద్యాధికారులు కాళేశ్వరం డాక్టర్ సుస్మిత, అంబట్‌పల్లి డాక్టర్ రఘురామన్, మురళీధర రెడ్డి, నిర్మల మేరీ, సత్యనారాయణ, రాజా రమణయ్య ఉన్నారు.

సీఐ, ఎస్సైని కలిసిన నాయకులు



సీఐ శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ములుగు: ములుగు సీఐగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌ను, ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అహ్మద్‌పాషా, జిల్లా కార్యదర్శి యాసం రవికుమార్, కార్యనిర్వాహణ కార్యదర్శి కుత్బోద్దీన్, రఘువీర్, షకీల్, ఓడ రాజు, బోడ రఘు, కొత్తకొండ రమేశ్, హాజీపాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ఎంతో మేలు

ఏటూరునాగారం/మంగపేట: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంగపేట మండలం నర్సింహసాగర్‌కు ఆర్టీసీ బస్సు షటిల్ సర్వీస్‌ను సీతక్క మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫ్రీ టికెట్‌ను తీసుకొని బస్టాండ్ నుంచి క్రాస్‌రోడ్డు ఐటీడీఏ వరకు ప్రయాణించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించిన మంత్రి సీతక్కకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏఎస్పీ మహేష్ గీతె బాబా సాహెబ్, ఆర్టీసీ డీఎం సురేష్ కుమార్, కంట్రోలర్ శంకర్, డీసీసీ అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

టీఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని వివిధ రకాలుగా నష్టపోయిన నలుగురు గిరిజనులకు తక్షణ సాయం కింద ట్రైబల్ రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఐటీడీఏలో మంత్రి సీతక్క బాధితులకు అందజేశారు. మంగపేట మండలం చీపురుదుబ్బ గ్రామానికి చెందిన పెనక సరోజన ఇళ్లు ఇటీవల పిడుగుపడి కాలిపోవడంతో ఆమెకు రూ.25వేల చెక్కును మంత్రి అందజేశారు. అలాగే మంగపేట మండలం ఓడగూడెంకు చెందిన వాసం నగేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా అతడికి, మేడారానికి చెందిన చంద్రకళకు అనా రోగ్య సమస్య, వెంకటాపురం(కె) మండలా నికి చెందిన రాజేశ్వరికి అనారోగ్య సమస్య ఉండడంతో చెక్కులను అందజేశారు. అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఎస్ఎస్‌తాడ్వాయి: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని డీఎస్పీ రవీందర్ అన్నారు. మండలంలోని నార్లాపూర్ సమీప అటవీ ప్రాంతంలో తక్కళ్లపాడు గొత్తికోయగూడెంను డీఎస్పీ రవీందర్ మంగళవారం సందర్శించారు. గూడెంలోని ఆదివాసీ గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గూడెంలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన గొత్తికోయలతో మాట్లాడుతూ గూడెంలో ఎదైనా సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పోలీసుశాఖ తరుపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్, సాంబయ్య, టీఎస్ఎస్‌పీ సిబ్బంది ఉన్నారు.